క్లుప్తంగా

ఆర్‌డీని అభినందించిన ఉద్యోగులు



ఆరోగ్యశాఖ ఆర్‌డీ రామ గిద్దయ్యను అభినందిస్తున్న ఉద్యోగులు

మహారాణిపేట : వైద్య ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ (ఆర్‌డీ) డాక్టర్ రామ గిద్దయ్యను జేఏసీ ఉద్యోగుల సంఘం నాయకులు అభినందించారు. ఇటీవల ఆర్‌డీ రామ గిద్దయ్య బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఉద్యోగ సంఘం నాయకులు తెలిపారు. సంఘం నాయకులు ఎం. వెంకట లక్ష్మి, శ్రీనివాస ఆచార్యులు, నగేష్ పట్నాయక్, సాంబమూర్తి, రాము, బండారు శ్రీనివాస్, శేషుబాబు, రత్నం తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు అభినందనలు



సాయి రమేష్‌ను అభినందిస్తున్న బాదంగీర్ సాయి తదితరులు

సీతమ్మధార : బాలనటుడిగా అంతులేని కథ, నేరము శిక్ష, మేమూ మనుషులమే, మీరైతే ఏం చేస్తారు వంటి చలన చిత్రాల్లో నటించి, తదుపరి సినిమా పరిశ్రమలో కొన్ని శాఖల్లో పని చేసిన విశాఖ వాసి సాయి రమేష్ (అలియాస్ రమేశ్ యాదవ్)ను శ్రీ విఘేశ్వర ఆర్ట్స్ సొసైటీ (హైదరాబాద్) ఇటీవల తెలంగాణ కల్చరల్ అవార్డుతో సత్కరించింది. ఈ నేపథ్యంలో ఆయనను రంగసాయి నాటక గ్రంథాలయ వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి, ధైర్యం చలన చిత్ర దర్శకుడు విష్ణుదేవ్, రచయిత చరణ్, నటుడు నవీన్, విజయలక్ష్మి, సుశీల తదితరులు అభినందించారు.

19 నుంచి పునీత జోజప్ప మహోత్సవాలు



జోజప్ప విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న డాక్టర్ సిస్టర్ షైజీ తదితరులు

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఈ నెల 19 నుంచి పాలక పునీత జోజప్ప మహోత్సవం జరగనున్న దృష్ట్యా సోమవారం కళాశాల ప్రాంగణంలో జోజప్ప విగ్రహానికి నివాళులు అర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ మాట్లాడుతూ దయామయుడు, ప్రేమైక మూర్తి ఏసుప్రభువు తండ్రి జోసెఫ్ పేరుతో స్థాపించిన కళాశాల నిరంతరం ప్రేమతో సంరక్షిస్తున్న పునీతను కీర్తిస్తుందన్నారు. మంగళవారం నుంచి రెండు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ హేమ, హిందీ విభాగాధిపతి డాక్టర్ పి.కె. జయలక్ష్మి, సిస్టర్లు మేరీ, జైన్, నాన్సీ, దీపాలి, డెయిజీ, అధ్యాపకులు డాక్టర్ హరిణి తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబ అమ్మవారి హుండీ ఆదాయం రూ. 25.8 లక్షలు

కంచరపాలెం : జ్ఞానాపురంలో గల ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో సోమవారం దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకులు అమ్మవారి హుండీలు లెక్కించారు. 68 రోజులకుగాను అమ్మవారి దర్శనాలకు సంబంధించి రూ.25,88,219 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. సహాయ కమిషనర్, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్. ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ, పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ, సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, కంచరపాలెం పోలీసులు, కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఓటరును కలవండి..

- గెలుపు మనదే అయినా నిర్లక్ష్యం వద్దు..
- 3 కాదు.. 30 పార్టీలు ఏకమైనా జగన్‌మోహన్‌రెడ్డి విజయాన్ని ఆపలేరు
- పార్టీ శ్రేణులతో వాసుపల్లి గణేష్‌కుమార్



వాసుపల్లికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న జాన్‌వెస్లీ



వార్డుల కార్పొరేటర్లు, నాయకులతో సమావేశమైన దక్షిణ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : నియోజకవర్గంలోని ప్రతి వార్డులో ప్రతి ఓటరును నేరుగా వెళ్లి కలవాలని దక్షిణ నియోజకవర్గం అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ నాయకులకు సూచించారు. ఆశీల్‌మెట్ట సమీపాన అశోక్‌నగర్‌లో గల తన కార్యాలయంలో సోమవారం 27, 29, 30, 31, 32 వార్డుల కార్పొరేటర్లు, వార్డు నాయకులు, బూత్ ప్రెసిడెంట్లు, మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుపల్లి పలు సూచనలు చేస్తూ నాయకత్వ శక్తిని పెంచాలని, తటస్థంగా ఉన్న వారి ఇళ్లకు వెళ్లి కలిసి మాట్లాడాలన్నారు. దక్షిణ నియోజకవర్గంలో జగన్ బ్రాండ్ ఇమేజ్ ఉందని, ప్రత్యర్థులు కూడా వైఎస్సార్‌సీపీ వైపే మొగ్గు చూపుతున్నారన్నారు. చంద్రబాబుని నమ్మే ప్రసక్తే లేదని, మూడు పార్టీలు కాదు.. 30 పార్టీలు కలిసి వచ్చినా జగన్ గెలుపును ఎవరూ ఆపలేరన్నారు. ప్రజలకు చేసిన మేలును వారికి గుర్తు చేస్తే చాలన్నారు. దక్షిణంలో మనకు.. మన పార్టీకి స్ట్రాంగ్ నాయకత్వం ఉందని, ముఖ్యంగా 20న మేనిఫెస్టో రానుందని, డోర్ టు డోర్ వెళ్లి ప్రజలను కలిసి వివరించాలన్నారు. సమావేశంలో ఆయా వార్డుల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

24న ప్రచారం ప్రారంభం..

పూర్ణామార్కెట్ వెలంపేటలో వేంచేసిన దుర్గాలమ్మను దర్శించుకుని, అమ్మ ఆశీస్సులు పొంది ఈ నెల 24న ప్రచారం ప్రారంభించనున్నట్టు వాసుపల్లి తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ప్రచారం ప్రారంభించనున్న దృష్ట్యా పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు.

హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా మీదే గెలుపు..

హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా మూడోసారి కూడా మీరే గెలుస్తారని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ వాసుపల్లి గణేష్‌కుమార్‌ను సోమవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. దక్షిణ నియోజకవర్గంలో వాసుపల్లి హవాతో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని జాన్ వెస్లీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో సనపల రవీంద్రభరత్, వద్దాది దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొల్లి సింహాచలం

మహారాణిపేట : వైఎస్సార్‌సీపీ విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ మండల అధ్యక్షురాలు, 39వ వార్డు ఇన్‌చార్జి కొల్లి సింహాచలం అన్నారు. సోమవారం లక్ష్మీటాకీసు జంక్షన్ వద్ద పార్టీ కార్యకర్తల సమావేశంలో ప్రసంగించారు. అన్ని వార్డుల్లో బూత్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. చురుగ్గా పని చేసే వారికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ కమిటీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ముఖ్య నాయకులు, ట్రస్టు బోర్డు సభ్యులు, కార్యకర్తలు, జగనన్న అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ మీరే మా ఎమ్మెల్యే

- జెండా చెట్టు ముస్లిం కమిటీ సభ్యులు



ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లిని సత్కరిస్తున్న జెండా చెట్టు ముస్లిం కమిటీ సభ్యులు

డాబాగార్డెన్స్ : దక్షిణ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌ను పార్టీ కార్యాలయంలో సోమవారం కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం ఆధ్వర్యంలో జెండా చెట్టు ముస్లిం కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆయనకు దక్షిణ సీటు కేటాయించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. మళ్లీ మీరే మా ఎమ్మెల్యే అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంజుమాన్ రజా గౌస్ పెన్షన్ కుమ్మర వీధి జెండా జట్టు కమిటీ సభ్యులు మాట్లాడుతూ నియోజకవర్గంలో వాసుపల్లిని గెలిపించుకుంటామని తెలిపారు. ఆయన పేదల పక్షపాతి అన్నారు. కార్యక్రమంలో ఎండీ గౌస్, సయ్యద్ గౌస్, సయ్యద్ రిజ్వాన్, ఇస్మాయిల్, షిరీష్, ఎండీ అజీజ్, సిరాజ్ సయ్యద్ హాజీ, ఎస్కే సదాబ్, వైఎస్సార్‌సీపీ నాయకులు మాణిక్యాలరావు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు భద్రత కల్పించాలి



జీవీఎంసీ గాంధీ పార్కులో ధర్నా చేస్తున్న హమాలీలు

సీతమ్మధార: సివిల్ సప్లై హమాలీలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ పార్కులో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.మన్మథరావు మాట్లాడుతూ పౌర సరఫరాల సంస్థ ప్రారంభం నుంచి హమాలీలు బియ్యం లోడింగ్ చేస్తున్నారని తెలిపారు. ఇన్నేళ్లుగా పని చేస్తున్నప్పటికీ వారి ఆదాయం కుటుంబ పోషణకే సరిపోవడం లేదన్నారు. కొత్త ప్రతిపాదన వలన హమాలీలకు వస్తున్న ఆదాయం తగ్గిపోతుందని, ఇటువంటి ప్రతిపాదనలు రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ మానుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో ఎస్కే రెహ్మాన్, కాసుబాబు, పి.అప్పారావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



ఆయుర్వేద వైద్య శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

మద్దిలపాలెం : ఆరోగ్యమే మహాభాగ్యం నినాదంతో మంగళ, బుధవారాల్లో విశాఖలో ఉచిత సిద్ధ ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నామని గో ఆధారిత వ్యవసాయదారుల సంఘం అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ తెలిపారు. ఈ మేరకు సోమవారం శివాజీపాలెంలోని కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విశాలాక్షినగర్‌లోని బీవీకే హైస్కూల్ ప్రాంగణంలో ఈ శిబిరం జరుగుతుందన్నారు. ఈ శిబిరానికి హైదరాబాద్‌కు చెందిన ఆక్యుప్రెషర్ వైద్య నిపుణులు గురూజీ జై శ్రీరామ్ హాజరవుతున్నారని తెలిపారు. రోజుకు 125 నుంచి 150 మందికి మాత్రమే పరీక్షలు చేయనున్నారన్నారు. ఆసక్తి ఉన్న వారు వాట్సాప్ లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 98661 38129, 99666 51052 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పైడిమాంబ నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం



ఆరిలోవ: జాతీయ రహదారిని ఆనుకుని డెయిరీ ఫారం వద్ద పైడిమాంబ అమ్మవారి నవరాత్రి జాతర మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 26 వరకు కొనసాగనున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మొదటి రోజు విఘ్నేశ్వర పూజ, అమ్మవారికి జల, క్షీర, పంచామృత, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం కుంకుమ పూజలు, సహస్రనామ పారాయణం, భజనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. 26న అమ్మవారి జాతర మహోత్సవం, పరస జరుగుతుందన్నారు. ఈ ముగింపు ఉత్సవాలలో తప్పెటగుళ్లు, బుట్టబొమ్మలు డ్యాన్స్, బాణసంచా, సాముగరిడి, పులివేషాలు, తీన్‌మార్, ఒడిశా దూమ్‌దడక్, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఏప్రిల్ 2న అమ్మవారికి మారు పండగ, ఆ రోజు మధ్యాహ్నం మహా అన్నసమారాధన చేపడతామన్నారు.

యువకుడిని కాపాడిన లైఫ్‌గార్డ్స్



కాపాడిన యువకుడితో లైఫ్‌గార్డ్స్

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో కొట్టుకుపోతుండగా యువకుడిని లైఫ్‌గార్డ్స్ కాపాడారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇవీ. పార్వతీపురం ప్రాంతానికి చెందిన నలుగురు యువకులు సోమవారం సాయంత్రం సరదాగా గడిపేందుకు రుషికొండ బీచ్‌కు చేరుకున్నారు. కాసేపు స్నేహితులంతా సరదాగా గడిపి బీచ్‌లో స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా వుండడంతో వారిలో గంటా మనోహర్ అనే యువకుడు కొట్టుకుపోతుండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్స్ సూరాడ నూకరాజు, చిన్నప్పన్న, ఎం.అమ్మోరు, చందు, సతీష్ గమనించి సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు. ప్రాణాపాయం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వీరికి మెరైన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.

సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

దక్షిణం అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్



కేసీ కెనాల్ దుస్థితిని వీక్షిస్తున్న దక్షిణం అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : పోర్టు పనులు జరుగుతున్న కారణంగా ఫెర్రీరోడ్డు కెనాల్ మూసివేయడంతో గెడ్డలు నిండిపోయి 39వ వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, కష్టాలు త్వరలోనే పరిష్కరిస్తానని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్‌పర్సన్ కొల్లి సింహాచలంతో కలిసి వాసుపల్లి పర్యటించారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలు చూసి చలించిపోయారు. తక్షణమే పోర్టు చైర్మన్‌తో మాట్లాడి కెనాల్ నుంచి 12 గేట్ల ద్వారా దక్షిణ నియోజకవర్గంలో ఉన్న గెడ్డ వాగు అంతా సముద్రంలోకి వెళ్లాల్సి ఉందన్నారు. పోర్టు బ్రిడ్జి నిర్మాణం వల్ల ఫెర్రీరోడ్డు కెనాల్ 11 గేట్లు మూసివేయడం, కేవలం ఒకే ఒక్క గేట్ మాత్రమే తెరచి ఉందన్నారు. దీంతో 39వ వార్డు కోటవీధి, ఫెర్రీరోడ్డు ప్రాంతంలో పూర్తిగా మురుగు కాలువలు పొంగి పొర్లుతున్నాయన్నారు. దోమలు పెరిగి విషజ్వరాల బారిన పడుతున్న ప్రజల సమస్య పరిష్కరించేందుకు తక్షణమే పోర్టు అధికారులతో మాట్లాడతానని వాసుపల్లి స్థానికులకు ధైర్యం కల్పించారు. సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని వాసుపల్లి పేర్కొన్నారు.

ఫుడ్‌కోర్టు, తోపుడు బళ్ల వద్ద డస్ట్‌బిన్లు తప్పనిసరి



ఫుడ్‌కోర్టు వద్ద చెత్త ఎత్తిస్తున్న జెడ్సీ ప్రసాదరావు

జగదాంబ : ఫుడ్‌కోర్టు, తోపుడు బళ్ల వద్ద డస్ట్‌బిన్లు తప్పనిసరిగా వాడాలని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు అన్నారు. సోమవారం జోన్ పరిధిలో ఆర్టీసీ కాంప్లెక్స్, ఫుడ్‌కోర్టు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఫుడ్‌కోర్టు వద్ద అపరిశుభ్రంగా ఉండడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. తోపుడుబండ్ల వ్యాపారులు తమ బళ్ల కింద కవర్లు వేసుకోవాలని, డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేసుకోవాలన్నారు. లేని పక్షంలో వారి అనుమతులు నిరాకరించడంతో పాటు అపరాధ రుసుము విధించాలని సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్, సెక్రటరీలను ఆదేశించారు. అనంతరం ప్రధాన రహదారులను పరిశీలించిన ఆయన రోడ్ల పక్కన చెత్త కుప్పలుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాత్రివేళల్లో పారిశుద్ధ్య పనులు చేసే సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. కాంట్రాక్టర్లు దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

కొప్పల వెలమలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

డాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర జిల్లాల్లో అత్యధిక శాతం గల కొప్పుల వెలమలను ఏ రాజకీయ పార్టీ గుర్తిస్తుందో ఆ పార్టీకే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని రాష్ట్ర కొప్పుల వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కిలపర్తి పరదేశినాయుడు తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో సుమారు 20 లక్షల మందికి పైగా కొప్పుల వెలమలు ఉన్నారన్నారు. విజయనగరం జిల్లా విషయానికొస్తే అధికార పక్షం కొప్పుల వెలమలకు ఒక సీటు కేటాయిస్తే.. ప్రతిపక్ష పార్టీ ఒక్క సీటు కూడా కేటాయించలేదని తెలిపారు. విజయనగరం జిల్లా కొప్పుల వెలమ సంఘం అధ్యక్షుడు బొత్స వర ప్రసాద్, గౌరవ అధ్యక్షుడు శీర సత్యనారాయణ, అసోసియేటెడ్ అధ్యక్షుడు దొగ్గ దేముడు, గురుపూరు రామారావు, మేకాపు శ్రీహరినాయుడు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్త రోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

మైదానానికి మహర్దశ

- చురుగ్గా ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం అభివృద్ధి పనులు
- మళ్లీ అంతర్జాతీయ మ్యాచ్‌లు చూసే భాగ్యం కలుగుతుందని క్రీడా ప్రేమికుల ఆనందం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ చొరవకు క్రీడాకారులు, కోచ్‌ల హర్షం

పాతనగరంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం ఒకప్పుడు జాతీయ, అంతర్జాతీయ మ్యాచ్‌లతో ఒక వెలుగు వెలిగింది. అయితే తర్వాతి కాలంలో పాలకుల నిర్లక్ష్యం వల్ల ఈ మైదానం నిర్లక్ష్యానికి గురయి శిథిలావస్థకు చేరుకుంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్టేడియం అభివృద్ధికి నడుం బిగించింది. తొలి విడతగా రూ. 1.60 కోట్లతో పనులు ప్రారంభించింది. ఈ నిధులతో స్టేడియంలోని గ్యాలరీలు, స్కోర్ బోర్డు, స్టేడియం చుట్టూ తారురోడ్డు, గ్రీనరీ, కార్ పార్కింగ్‌తో పాటు మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు చురుగ్గా పనులు జరుగుతున్నాయి.



స్టేడియంలో సిద్ధమవుతున్న గ్యాలరీలు



ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం

జగదాంబ : ఇందిరా ప్రియదర్శిని స్టేడియం మునుపటి కళ సంతరించుకుంటోంది. ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన ఈ మైదానం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోంది. ముఖ్యంగా దక్షిణం ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ తన ప్రత్యేక చొరవతో స్టేడియం అభివృద్ధికి ప్రభుత్వ నిధులు మంజూరయ్యేలా కృషి చేశారు. ఒకప్పుడు అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లతో వెలిగిపోయిన ఈ స్టేడియం గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురయింది. అప్పుడు కేవలం రాజకీయ సభలు, సమావేశాలకే ఈ స్టేడియంను వాడుకున్న నాటి ప్రభుత్వాలు తర్వాత మైదానం అభివృద్ధి గురించి పట్టించుకోలేదు. ఈ దశలో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్టేడియం అభివృద్ధికి నడుం బిగించి.. స్థానిక క్రీడాకారుల మన్ననలు అందుకుంటోంది.

మొదటి దశలో రూ.1.60 కోట్లతో..

ఇందిరా ప్రియదర్శిని స్టేడియం అభివృద్ధికి మొదటి దశగా రూ. 1.60 కోట్లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో స్టేడియంలోని గ్యాలరీలు, పెవిలియన్ బాక్స్‌లు, గ్యాలరీ కింది భాగంలో గదుల నిర్మాణం, మరుగుదొడ్లు, స్కోర్ బోర్డు, స్టేడియం చుట్టూ తారురోడ్డు, పచ్చదనం పరిఢవిల్లేలా మొక్కల పెంపకం, కాలువలు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు వంటి పనులు ప్రారంభించారు.

అన్ని క్రీడలకు చోటు..

స్టేడియంలో జాతీయ, అంతర్జాతీయ క్రీడలు జరిగే నేపథ్యంలో ప్రధాన గ్యాలరీకి ఆనుకుని ఉన్న గదులకు మరమ్మతు చేస్తున్నారు. స్నూకర్, టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్స్, బాక్సింగ్ రింగ్, జిమ్, టాయిలెట్స్, అడ్మిన్ రూమ్‌లు ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. అలాగే గ్యాలరీల వెనుక భాగంలోని ఖాళీ స్థలంలో బ్యాడ్మింటన్, వాలీబాల్ కోర్టులు, పార్కింగ్ స్థలాలు, స్కేటింగ్, చిల్డ్రన్ ప్లే ఏరియా వంటి వాటి ఏర్పాటుకు ఇంజినీరింగ్ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. స్టేడియం అంతటా గ్రీనరీ, ల్యాండ్ స్కేపింగ్, మినీయేచర్స్, కూర్చునే బల్లలు, వంద కార్లు నిలిపి ఉంచేలా పార్కింగ్ ఏరియాకు పనులు జరుగుతున్నాయి.

క్రీడలకు ప్రభుత్వం చేయూత..



క్రీడల పట్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఎంతో కాలంగా శిథిలమై ఉన్న స్టేడియంను మళ్లీ ఆధునికీకరిస్తున్నారు. దీంతో మళ్లీ పాతనగరంలో క్రీడలకు మంచి రోజులు వచ్చాయి. మున్సిపల్ స్టేడియం అభివృద్ధితో యువత క్రీడారంగంపై శ్రద్ధ చూపుతారు.

– దుర్గ, కిక్ బాక్సింగ్ కోచ్

పాత స్టేడియంకు కొత్త కళ..



మున్సిపల్ స్టేడియం కొత్త కళ సంతరించుకుంటోంది. గతంలో మాతరం వాళ్లమంతా ఈ స్టేడియంలో అంతర్జాతీయ మ్యాచ్‌లు చూసేవాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దయ వల్ల మా తర్వాతి తరం వాళ్లు కూడా ఈ మైదానంలో అంతర్జాతీయ మ్యాచ్‌లు చూస్తారు.

– ఆదినారాయణ, వెలంపేట, 35వ వార్డు

త్వరితగతిన పనులు పూర్తి చేస్తున్నాం..

జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు స్టేడియంలో 60 శాతం కంటే ఎక్కువ పనులు పూర్తి చేశాం. కొత్తగా టెన్నిస్, క్రికెట్, వాలీబాల్, బాస్కెట్ బాల్ కోర్టులు సిద్ధం చేస్తున్నాం. స్నూకర్, టేబుల్ టెన్నిస్ వంటి అన్ని క్రీడలకు వేదికగా ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంను తీర్చిదిద్దుతున్నాం.

– సంతోష్‌కుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జీవీఎంసీ జోన్–4 కార్యాలయం

ఉత్సాహంగా వీడ్కోలు వేడుక



ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్య ప్రదర్శన

డాబాగార్డెన్స్ : ఆశీల్‌మెట్ట శ్రీచైతన్య పాఠశాల టెన్త్ విద్యార్థుల (సీబీఎస్ఈ) వీడ్కోలు కార్యక్రమం సోమవారం ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగింది. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో టెన్త్ విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర శ్రీచైతన్య పాఠశాలల రీజనల్ ఇన్‌చార్జి అహ్మద్ ఆలీ పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చేసే పని పట్ల అంకితభావం, నిరంతర సాధన అలవరచుకోవాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె. నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ సృజనాత్మకతతో గొప్పస్థాయిలో నిలిచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఏజీఎం ఎంవీ సురేష్, జోనల్ కో ఆర్డినేటర్ ఎల్. రాజేష్, డీన్ పి. రవికుమార్, అసిస్టెంట్ డీన్ మాధవనాయుడు పాల్గొన్నారు.